www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 67 | | 19-8-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## విద్యార్థులపై దాడి.. విచారణకు సుప్రీం కమిటీ

- 'చలో పార్లమెంట్' ఘటనపై త్రిసభ్య ధర్మాసనం కీలక నిర్ణయం
- మాజీ న్యాయమూర్తులు, విశ్రాంత డీజీపీతో ఉన్నతస్థాయి ప్యానెల్
- వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించనున్న బృందం

4



## ఆ కర్కశత్వాన్ని ప్రశంసించాలా?

- మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై రాహుల్ ఫైర్
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్, లాఠీలతో దౌర్జన్యం
- గాయపడిన చిన్నారులను పరామర్శించానన్న కాంగ్రెస్ ఎంపీ
- తప్పులు అంగీకరించని వారితోనే దేశానికి ముప్పు అని వ్యాఖ్య

4



# గీత, చేనేత కార్మికులకు
# సాచ్యురేషన్ పింఛన్లు

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- గీత కార్మికుల సంక్షేమానికి పలు కీలక ప్రకటనలు
- పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని వెల్లడి
- విద్య, సామాజిక న్యాయంతో తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని స్పష్టం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 :**

రాష్ట్రంలోని గీత, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. గీత కార్మికులు, చేనేత కార్మికులు రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థలో కీలక భాగమని పేర్కొంటూ, అర్హులైన వారందరికీ సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామని, ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గీత వృత్తి తరతరాలకు కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలక్రమేణా ఈత, తాటి చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో వృత్తిపై ప్రభావం పడుతోందని పేర్కొంటూ, నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్ల వెంట ఈత, తాటి మొక్కలను విస్తృతంగా నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించినట్లు వెల్లడించారు. ఈ చర్యల తరువాయి 2లో..

## తెలంగాణను స్వచ్ఛ ఇంధన
## కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడిదారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం
- 2035 నాటికి 26 వేల మెగావాట్ల సౌర విద్యుత్ లక్ష్యం
- ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026 ప్రారంభం



**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 :**

తెలంగాణను స్వచ్ఛ ఇంధన తయారీ కేంద్రంగా, ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవోటెల్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి హాజరైన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను ఉద్దేశించి మాట్లాడిన భట్టి, తెలంగాణ పెట్టుబడిదారులకు స్వర్గధామంలాంటి రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఇంధన రంగంలో మార్పు అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి విధానంలో మార్పు కాదని, అది మొత్తం ఆర్థిక వ్యవస్థను మార్చే పరివర్తన ప్రక్రియ అని భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛ ఇంధన వినియోగదారుగా కాకుండా, స్వచ్ఛ ఇంధన సాంకేతికతల తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా సమన్వయం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.రాష్ట్రంలో సౌర విద్యుత్ తరువాయి 2లో..

## తాగునీరు--సాగునీటి
## సమతుల్యతే లక్ష్యం

- ఎల్‌నినో పరిస్థితుల్లో జాగ్రత్తగా నీటి నిర్వహణ
- తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం
- నిల్వలు, ప్రవాహాల ఆధారంగానే నీటి విడుదల
- రైతులకు పారదర్శకంగా సమాచారం ఇవ్వాలని ఆదేశం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 :**

రాష్ట్రంలో కొనసాగుతున్న ఎల్‌నినో పరిస్థితులు, మిగిలిన వర్షాకాలంపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో తాగునీటి అవసరాలు, సాగునీటి అవసరాల మధ్య సమతుల్యత పాటించాలని నీటిపారుదల, తరువాయి 2లో..

## భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి




- సామాజిక న్యాయంపై కవిత విమర్శలు
- భూ పంపిణీ మళ్లీ చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వ భూ విధానాలపై తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 :**

తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే మరోసారి భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తరువాయి 2లో..

## అభివృద్ధి భారత్‌కు
## వ్యవసాయమే పునాది

- ఐసీఏఆర్ 97వ వార్షిక సర్వసభ్య సమావేశం
- రైతు అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు
- ఉత్పత్తి పెంపు దాటి ప్రపంచ మార్కెట్లపై దృష్టి
- వ్యవసాయ రంగానికి కొత్త కార్యాచరణ దిశ



**న్యూఢిల్లీ ప్రతినిధి, ఆగస్టు 18 :**

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) సొసైటీ 97వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం తరువాయి 6లో..

## సెమికాన్ ఇండియా--2026కు సర్వం సిద్ధం

- ప్రపంచ సెమికండక్టర్ దిగ్గజాల సమాగమం
- న్యూఢిల్లీ వేదికగా భారీ ప్రదర్శన



**న్యూఢిల్లీ ప్రతినిధి, ఆగస్టు 18 :**

భారతదేశంలోనే అతిపెద్ద సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగ ప్రదర్శనగా గుర్తింపు పొందిన సెమికాన్ ఇండియా--2026 కార్యక్రమం తరువాయి 2లో..

## 22ఏ జాబితాపై
## హరీశ్‌రావు ఆగ్రహం

- నిషేధిత భూముల జాబితా రద్దు చేయాలి
- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శ
- రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**మల్కాజ్‌గిరి ప్రతినిధి, ఆగస్టు 18 :**

మల్కాజ్‌గిరిలో 22ఏనిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేతహరీశ్‌రావు పాల్గొన్నారు. తరువాయి 2లో..



## నైపుణ్యమే జీవితానికి రాజయోగం



- ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ వేడుకలు ప్రారంభం
- యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి
- కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం డీకే శివకుమార్

2లో

## రైతు అవసరాలకే
## ఉద్యాన పరిశోధనలు

- హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన
- ఆధునిక సాంకేతికతతో రైతులకు చేరే పరిశోధనలు
- తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ లక్ష్యం

**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 :**

రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, పరిశోధన ఫలితాలు నేరుగా రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల తరువాయి 6 లో..



ఉద్యమ కెరటం
బుధవారం
19 ఆగస్టు 2026

# గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా గీత కార్మికుల జీవనాధారాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ బహుజన సమాజ గర్వకారణమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడు పాపన్న అని అన్నారు. బహుజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, తెలంగాణకు వచ్చే ప్రతి ఒక్కరూ పాపన్న చరిత్రను తెలుసుకోవాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. నెక్లెస్ రోడ్ పరిసరాల్లో స్వయంగా స్థలాన్ని పరిశీలించి ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశామని చెప్పారు. గణేష్ నిమజ్జనాలు, పర్యాటక సందర్శనల సమయంలో లక్షలాది మంది ఈ విగ్రహాన్ని చూసి స్ఫూర్తి పొందుతారని అభిప్రాయపడ్డారు. ముదిరాజ్ సమాజానికి చెందిన మహాయోధుడు పండుగ సాయన్న సేవలను కూడా ప్రభుత్వం గుర్తిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో బహుజన నాయకుల పాత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా కార్యరూపంలో కనిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే బీసీ కులగణన నిర్వహించామని, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేశామని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాలకు తగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కులవృత్తులను గౌరవించాలే గానీ, పిల్లల భవిష్యత్తు కోసం వారిని తప్పనిసరిగా చదివించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పేద కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నాణ్యమైన విద్య అవసరమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఏటీసీల్లో చేరే యువతకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని, విద్య కోసం ఎంత నిధులు అవసరమైనా వెనుకాడబోమని హామీ ఇచ్చారు. తెలంగాణను సామాజిక న్యాయం, సమాన అవకాశాల రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బహుజన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గీత, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, రైతులు సహా ప్రతి వర్గం సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, స్వాభిమానంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణను స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం



(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని భట్టి వెల్లడించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధిలో విద్యుత్ నిల్వ వ్యవస్థలు కీలకమని పేర్కొంటూ, బ్యాటరీ నిల్వ కేంద్రాలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ సామర్థ్యాన్ని సాధించాలని రాష్ట్రం ప్రణాళిక రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ ఐటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో సాధించిన ప్రగతిని విద్యుత్ రంగంలోనూ వినియోగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతిపాదిత 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధస్సు డేటా కేంద్రానికి ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం కలయికతో తెలంగాణ కొత్త అభివృద్ధి నమూనాను సృష్టించనుందని పేర్కొన్నారు. హరిత హైడ్రోజన్, విద్యుత్ వాహనాల రంగాల్లో కూడా తెలంగాణ ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించిందని భట్టి తెలిపారు. 2030 నాటికి ఏటా నాలుగు లక్షల టన్నుల హరిత హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని, 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12 వేల విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన, బ్యాటరీ పరికరాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు మూలధన సబ్సిడీలు, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీ-ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు అందిస్తామని ప్రకటించారు. ఈ ఇంధన పరివర్తన ప్రయాణం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే విజయవంతమవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సమ్మిట్ అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించి సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి




(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే "భూలక్ష్మి" పథకం ద్వారా భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి పంపిణీ చేస్తామని ప్రకటించారు. భూమి అనేది పేదలకు ఆస్తి మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పేరుతో మాట్లాడుతున్నప్పటికీ ఆచరణలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సంకల్ప సభ తర్వాతే ప్రభుత్వం ఈ అంశంపై మాట్లాడడం ప్రారంభించిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు. భూ విధానాలపై కూడా కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, పేదల భూముల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూముల వినియోగంపై పారదర్శకత లేదని, భూములకు సంబంధించిన విధానాలు పేదలకు నష్టం కలిగించేలా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న భూమి వనరులను సమర్థంగా వినియోగిస్తే భూమిలేని కుటుంబాలకు భూమి పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, ఇతర అందుబాటులో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. భూమి పంపిణీ ద్వారా గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సామాజిక సమానత్వం కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. బీసీలు, మైనార్టీలు, మహిళలు, ఆదివాసీలు, దళితులకు తగిన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆస్తుల పంపిణీ ద్వారా కూడా సామాజిక న్యాయం సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూమి ఉన్న కుటుంబాలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని, అదే అవకాశాన్ని పేదలకు కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకాన్ని అమలు చేసి ప్రతి భూమిలేని పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి అందిస్తామని కవిత పునరుద్ఘాటించారు. సామాజిక న్యాయం కోసం ప్రజలు, మేధావులు, సామాజిక సంస్థలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పేదల భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, భూమి పంపిణీ ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

## 22ఏ జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు. రాత్రికి రాత్రే కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2008లో అప్పటి ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేసిన తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేని భూములను ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వేలాది భూములు, అలాగే హెచ్‌ఎండీఏ, హుడా పరిధిలోని స్థలాలు కూడా ఈ జాబితాలోకి చేరాయని ఆరోపించారు. ప్రజల ఆస్తి హక్కులను ప్రభుత్వం దెబ్బతీస్తోందని అన్నారు. నిషేధిత జాబితాలో భూములు ఉన్న విషయం ప్రజలకు ఆస్తి విక్రయానికి వెళ్లినప్పుడు మాత్రమే తెలుస్తోందని హరీశ్‌రావు చెప్పారు. తిలక్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి తన ఇంటిని విక్రయించేందుకు వెళ్లినప్పుడు నిషేధిత జాబితాలో ఉందని తెలిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనను ఉదాహరణగా ప్రస్తావించారు. ఇలాంటి సమస్యలు ఒకరికి కాదు, లక్షలాది మంది స్థల యజమానులకు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు భూయజమానుల నుంచి భూమి లేదా అభివృద్ధి హక్కులు కోరుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తప్పు జరిగినట్లయితే దానికి రాజకీయ బాధ్యత వహించాల్సింది ప్రభుత్వమేనని, అధికారులపై నెపం మోపడం సరి కాదన్నారు. జాబితాలో భూములను చేర్చిన వారు ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూముల వివాదంపై నైతిక బాధ్యత వహిస్తూ



రెవెన్యూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు సమయానికి అందాల్సిన సాయం ఆలస్యంగా అందుతోందని, దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపడం సరైన విధానం కాదన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడం, కార్యాలయాల చుట్టూ తిప్పడం కాకుండా ప్రభుత్వం స్వయంగా తప్పులను సరిదిద్దాలని హరీశ్‌రావు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిషేధిత జాబితా నుంచి అర్హమైన భూములను తొలగించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## సెమికాన్ ఇండియా--2026కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నెల 17 నుంచి 19 వరకు న్యూఢిల్లీలోని యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్)లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభించనున్నారు. దేశంలో సెమికండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల అభివృద్ధికి ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుంది. సెమికాన్ ఇండియా ఐదో ఎడిషన్‌గా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థలు, పరిశ్రమ నిపుణులు, పెట్టుబడిదారులు, పరిశోధకులు పాల్గొననున్నారు. సెమికండక్టర్ రంగానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, తయారీ సామర్థ్యాలు, పెట్టుబడి అవకాశాలు, నూతన ఆవిష్కరణలను ఒకే వేదికపై ప్రదర్శించనున్నారు. భారతదేశాన్ని ప్రపంచ సెమికండక్టర్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం మరింత వేగం తీసుకురానుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రదర్శనలో ప్రపంచ సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన 500కు పైగా సంస్థలు తమ ఉత్పత్తులు, సాంకేతికతలను ప్రదర్శించనున్నాయి. 240కు పైగా అంతర్జాతీయ సంస్థలు పాల్గొననున్నాయి. 150 మందికి పైగా అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన నిపుణులు వివిధ సాంకేతిక అంశాలపై ప్రసంగించనున్నారు. అలాగే 40కి పైగా దేశాల ప్రతినిధి బృందాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నాయి. 15 వేల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనలో ఆరు దేశాల ప్రత్యేక పెవిలియన్లు, పది రాష్ట్ర ప్రభుత్వాల పెవిలియన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ సాంకేతిక సామర్థ్యాలు, పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రదర్శించనున్నాయి. పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలకు, కొత్త పెట్టుబడులకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ స్టార్టప్ పెవిలియన్, ఇన్నోవేషన్ షోకేస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. యువ ఆవిష్కర్తలకు అవకాశాలు కల్పించే లక్ష్యంతో స్టార్టప్ పిచ్ పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల కోసం హ్యాకథాన్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. భవిష్యత్ సాంకేతిక రంగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ పెవిలియన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భారతదేశంలో సెమికండక్టర్ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంలో సెమికాన్ ఇండియా--2026 కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటికే సందర్శకుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. పరిశ్రమలు, విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, పెట్టుబడిదారులకు ఈ కార్యక్రమం అపూర్వ అవకాశాలను కల్పించనుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ పేర్కొంది.

## తాగునీరు--సాగునీటి సమతుల్యతే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జలసౌధలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జలాశయాల నీటి మట్టాలు, ఖరీఫ్ సాగు పరిస్థితులను పరిశీలించారు. తాగునీటి భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. అయితే తాగునీటి అవసరాలు పేరుతో సాగునీటిని అనవసరంగా నిలిపివేయకూడదని, అందుబాటులో ఉన్న నీటిని రైతుల పంటలకు చేరేలా చూడాలని సూచించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు పడతాయనే ఆశలపై కాకుండా, ప్రస్తుతం ఉన్న వినియోగయోగ్య నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవ వర్షపాతం అంచనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో ప్రస్తుతం 76.63 శాతం నీరు నిల్వ ఉందని అధికారులు వివరించారు. మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీలు నిల్వ ఉన్నాయని తెలిపారు. గోదావరి బేసిన్‌లోని జలాశయాల్లో 68.1 శాతం నిల్వలతో 208.38 టీఎంసీల నీరు ఉందన్నారు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 164 టీఎంసీల నీరు ఉండగా, మొత్తం సామర్థ్యం 312 టీఎంసీలని వివరించారు. సాగర్ ఎడమ కాలువ కింద నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని గుర్తు చేశారు. నీటి నిల్వలపై కేవలం శాతం లెక్కలు చూపించి ఆశావహ చిత్రాన్ని చూపవద్దని మంత్రి అధికారులను హెచ్చరించారు. మొత్తం నిల్వ, ప్రత్యక్ష వినియోగానికి అందుబాటులో ఉన్న నీరు, తాగునీటి అవసరాలు, సాగునీటికి మిగిలే పరిమాణం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాల పరిస్థితులను పోల్చి విశ్లేషించాలని, సెప్టెంబర్--అక్టోబర్‌లో భారీ వరదలు వస్తాయనే అంచనాలతో నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. వైరా జలాశయం, దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్, పోచారం, రాజీవ్ సాగర్, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు, చెల్మెలవాగు వంటి పలు ప్రాజెక్టుల పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి జలాలతో తిరిగి నింపే అవకాశం ఉన్న జలాశయాల నుంచి సాగునీటి విడుదలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మూసీ నదిలో అందుబాటులో ఉన్న నీటిని కూడా సాగుకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులు, బలోపేత పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల పురోగతిని సమీక్షిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే పనులను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ తాజా గణాంకాల ఆధారంగానే సాంకేతిక అధ్యయనాలు చేపట్టాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో సంభవించే ముంపుపై ఐఐటీ నిపుణులు చేస్తున్న అధ్యయనాన్ని వేగవంతం చేసి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే అంతర్రాష్ట్ర జల వివాదాలు, ట్రైబ్యునల్, సుప్రీంకోర్టు కేసులపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

## నైపుణ్యమే జీవితానికి రాజయోగం

బెంగళూరు ప్రతినిధి, ఆగస్టు 18 :

చేతిలో నైపుణ్యం ఉంటే జీవితంలో రాజయోగం ఉన్నట్టేనని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మరియు జీవనోపాధి శాఖతో పాటు కర్ణాటక నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విధానసౌధ విందు మందిరంలో నిర్వహించిన "ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ వేడుకలు--2026" కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో నైపుణ్య శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నైపుణ్యవంతులైన యువత ప్రధాన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువత కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యవసరమని చెప్పారు. విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా ఉంటే ఉద్యోగ అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు.




పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తూ యువతను ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించేందుకు పలు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరిగి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగు పడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు కూడా యువత నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యంపై మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు, సేవా రంగం, సాంకేతిక రంగాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పనతో పాటు వ్యవస్థాపకతను ప్రోత్సహించడంపైనా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాశ్ పాటిల్, రుద్రప్ప లమాని, కాంతా నాయక్, కర్ణాటక నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ హెచ్.ఎం. రేవన్న, హామీ పథకాల అమలు సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శాలిని రజనీష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యువతకు అందుబాటులో ఉన్న శిక్షణా అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. విద్యతో పాటు నైపుణ్యాలు కూడా సాధించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువతను సిద్ధం చేయడంలో నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఈ దిశగా ప్రభుత్వం తన కట్టుబాటును కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు చేసే వాకింగ్.. ఎలా పనిచేస్తుందంటే..



ఫ్యాటీ లివర్ సమస్య ప్రస్తుతం చాలామందిలో కనిపిస్తోంది. అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్ పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి కారణాలతో కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. ఈ సమస్యను నియంత్రించడానికి ఆహారంలో మార్పులతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమే. అయితే ఖరీదైన వర్కౌట్స్ చేయాల్సిన అవసరం లేకుండా రోజువారీ వేగవంతమైన నడకతోనే కాలేయ ఆరోగ్యానికి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. నడిచేప్పుడు కండరాలు ఎక్కువ గ్లూకోజ్, శక్తిని ఉపయోగిస్తాయి. దీనివల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడి రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. అలాగే కాలేయంలో కొవ్వు నిల్వ అవడానికి కారణమయ్యే కొన్ని మెటబాలిక్ సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది.

### నొప్పులు, వాపులు తగ్గేందుకు..

వేగంగా నడవడం వల్ల శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో కాలక్రమేణా శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును ఉపయోగించుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో, శరీరంలో వాపును తగ్గించడంలో కూడా క్రమం తప్పకుండా వ్యాయామం సహాయపడుతుంది. ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ముఖ్యమైన కారకాలను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. కాలేయ ఆరోగ్యం కోసం వారానికి 150 నుంచి 300 నిమిషాల మోస్తరు తీవ్రత కలిగిన శారీరక శ్రమ చేయాలని సూచిస్తున్నారు. అంటే రోజుకు సుమారు 30 నుంచి 45 నిమిషాల పాటు ఎక్కువ రోజులు బ్రిస్క్ వాకింగ్ చేయవచ్చు. ప్రస్తుతం వ్యాయామం చేయని వారు మొదటి రోజే ఎక్కువసేపు నడవాల్సిన అవసరం లేదు. తక్కువ సమయంతో ప్రారంభించి, క్రమంగా నడక సమయం, వేగాన్ని పెంచుకోవచ్చు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులు కూడా శారీరక శ్రమను పెంచుతాయి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, పని మధ్యలో కొద్దిసేపు నడవడం, భోజనం తర్వాత నడవడం వంటి అలవాట్లు మొత్తం శారీరక కదలికను పెంచుతాయి. అప్పుడప్పుడు మాత్రమే వ్యాయామం చేయడం కంటే ప్రతిరోజూ కదలికను ఒక అలవాటుగా మార్చుకోవడం ముఖ్యమని నిపుణుల సూచనలు చెబుతున్నాయి.

### నడకతోనే సమస్య తీరదు..

అయితే నడకతోనే ఫ్యాటీ లివర్ పూర్తిగా నయం అవుతుందని భావించకూడదు. నడక కాలేయంలో పేరుకున్న కొవ్వును తగ్గించడంలో, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి మెటబాలిక్ అంశాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కానీ ఫ్యాటీ లివర్ తీవ్రత, శరీర బరువు, ఆహారం, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, శారీరక శ్రమ, కాలేయ వ్యాధి దశ వంటి అనేక అంశాలపై ఫలితం ఆధారపడి ఉంటుంది. బరువు తగ్గడం కూడా కాలేయ ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాన్ని అందిస్తుంది. శరీర బరువులో సుమారు 5 శాతం తగ్గడం కాలేయంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. 7 నుంచి 10 శాతం వరకు బరువు తగ్గితే కాలేయంలోని వాపు మెరుగుపడటానికి, ప్రారంభ దశలో ఉన్న కాలేయ నష్టాన్ని కొంతమందిలో తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అయితే బరువు తగ్గడం వెంటనే కనిపించకపోయినా వ్యాయామం ఆపకూడదు. వ్యాయామం వల్ల బరువులో పెద్ద మార్పు లేకపోయినా కాలేయానికి ప్రయోజనం కలుగుతుంది.

### హారమూ ముఖ్యమే..

ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడానికి నడకతోపాటు సమతుల్యమైన ఆహారం కూడా అవసరం. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్ ఆహారాలను తీసుకోవడం మంచిది. చక్కెర కలిగిన పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, సంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను పరిమితం చేయాలి. నడకకు తోడు వారానికి రెండు నుంచి మూడు సార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ లేదా రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయడం కూడా ఉపయోగపడుతుంది. ఇవి కండరాలను బలోపేతం చేయడంతోపాటు శరీరం గ్లూకోజ్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మంచి నిద్రతోపాటు మధుమేహం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను నియంత్రించడం కూడా ఫ్యాటీ లివర్ నిర్వహణలో కీలకం. ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన మరో ముఖ్యమైన విషయం.. ప్రారంభ దశలో చాలామందికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. ఎలాంటి అసౌకర్యం లేకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. సమస్యను నిర్లక్ష్యం చేస్తే కొంతమందిలో కాలేయంలో వాపు, ఆపై ఫైబ్రోసిస్ లేదా మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది. పరిస్థితి మరింత తీవ్రమైతే సిరోసిస్, కాలేయ వైఫల్యం వంటి సమస్యలు వస్తాయి. కాలేయ క్యాన్సర్ ప్రమాదం కూడా పెరుగుతుంది.

### వైద్య పర్యవేక్షణ అవసరం..

అందుకే ఫ్యాటీ లివర్ ఉన్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణలో ఉండటం మంచిది. అవసరాన్ని బట్టి రక్త పరీక్షలు, స్కానింగ్ లేదా ఇతర పరీక్షలను వైద్యులు సూచిస్తారు. మధుమేహం, అధిక బరువు లేదా కాలేయ పరీక్షల్లో అసాధారణ ఫలితాలు ఉన్నవారు కూడా కాలేయ ఆరోగ్యం గురించి వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడంలో రోజువారీ బ్రిస్క్ వాకింగ్ ఒక సులభమైన, అందుబాటులో ఉండే అలవాటు. రోజూ వేసే ప్రతి అడుగు కాలేయ ఆరోగ్యానికి ఉపయోగపడే జీవనశైలి మార్పులో భాగమే. నడకతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, బరువు నియంత్రణ, స్ట్రెంగ్త్ వ్యాయామాలు, మంచి నిద్ర, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యల నియంత్రణను కలిపి కొనసాగిస్తే ఫ్యాటీ లివర్ ను మరింత మెరుగ్గా నిర్వహించవచ్చు.

## నెలనెలా మహిళల్లో వచ్చే హార్మోన్ల మార్పుల సమస్యలకు పరిష్కారం ఏమిటి.. నిపుణులు ఏం చెబుతున్నారు..?



ప్రతి నెలా పీరియడ్స్ సమయంలో చాలామంది మహిళలు కడుపు నొప్పి, అలసట, ఉబ్బరం, మూడ్ స్వింగ్స్, తీపి పదార్థాలపై కోరిక వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు. హార్మోన్లలో మార్పులు, రక్తస్రావం, కండరాల సంకోచాల కారణంగా ఈ సమయంలో శరీరానికి ఐరన్, మెగ్నీషియం వంటి కొన్ని పోషకాలు మరింత అవసరం అవుతాయి. అయితే రోజువారీ ఆహారంలో పాటించే కొన్ని అలవాట్లు ఈ అసౌకర్యాలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి, అలసట ఉన్నప్పుడు చాలామంది టీ లేదా కాఫీపై ఆధారపడుతుంటారు. కెఫీన్‌ను అధికంగా తీసుకోవడం వల్ల క్రాంప్స్, అలసట మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కెఫీన్‌లో ఉండే టానిన్లు ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. రక్తనాళాల సంకోచానికి కూడా కారణమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి బదులుగా వెచ్చని వాము నీటిని తీసుకోవడం ఒక ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు.

### చిన్న మొత్తంలో తినాలి..

పీరియడ్స్ సమయంలో హార్మోన్ల స్థాయిలు తగ్గడం వల్ల మూడ్‌ను ప్రభావితం చేసే మెదడులోని రసాయనాల్లో మార్పులు వస్తాయి. ఈ సమయంలో కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం వల్ల మూడ్ స్వింగ్స్, శక్తి తగ్గడం మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల వేడిగా, తేలికగా తీసుకునే బజ్రా ఖిచ్డీ లేదా రాజ్‌గిరా వంటి ఆహారాలను చిన్న మొత్తంలో తీసుకోవచ్చు. పీరియడ్స్ సమయంలో తీపి పదార్థాలపై తీవ్రమైన కోరిక కలగడం కూడా సాధారణమే. ఇలాంటి సమయంలో ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి, మొటిమల సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. చాక్లెట్లకు బదులుగా వేయించిన శనగలు లేదా నల్ల నువ్వులను బెల్లంతో కలిపి తీసుకోవచ్చు. అలాగే నువ్వుల బెల్లం లడ్డూలను కూడా ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు.

### సులభంగా జీర్ణం అవ్వాలి..

పీరియడ్స్ సమయంలో జీర్ణక్రియపై కూడా దృష్టి పెట్టాలి. ఈ సమయంలో శరీరానికి వేడి, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అవసరమవుతుంది. పచ్చి లేదా చల్లని ఆహారాలను జీర్ణం చేసుకోవడానికి శరీరానికి ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. దీంతో కొందరిలో కడుపు అసౌకర్యం లేదా క్రాంప్స్ మరింత ఇబ్బంది పెడుతుంది. అందువల్ల చల్లని సలాడ్లకు బదులుగా వేడి మసూర్ దాల్ వంటి సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో విపరీతమైన అలసట, నీరసం అనిపించినప్పుడు దాన్ని సాధారణంగానే తీసుకోకూడదు. రక్తస్రావం కారణంగా శరీరంలోని ఐరన్ నిల్వలు తగ్గే అవకాశం ఉంటుంది. ఐరన్ అవసరాలను తీర్చుకోవడంలో సహాయపడేందుకు నిమ్మరసంతో కలిపిన నీటిలో నానబెట్టిన ఒక టేబుల్‌స్పూన్ హలీమ్ విత్తనాలను తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో ఆహారపు అలవాట్లు కూడా శారీరక అసౌకర్యంపై ప్రభావం చూపిస్తాయి. అధికంగా టీ, కాఫీ తీసుకోవడం, కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం, ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వంటి అలవాట్లకు బదులుగా వెచ్చని, సులభంగా జీర్ణమయ్యే, పోషకాలు కలిగిన ఆహారాలను ఎంచుకోవడం ద్వారా అవసరమైన పోషకాలను అందించవచ్చు.

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వాళ్లు బీట్‌రూట్ తినవచ్చా..?



మధుమేహం అధిక రక్తపోటు మారిన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా బీట్‌రూట్ కిడ్నీ రోగులకు మంచిదా..? లేక హానికరమా..? అనే సందేహానికి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజెస్ ప్రకారం.. కాల్షియం ఆక్సలేట్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారు ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. బీట్‌రూట్ కూడా అలాంటి ఆహారాల్లో ఒకటి. అయితే కిడ్నీ బాధితులు బీట్‌రూట్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కాల్షియం ఆక్సలేట్ రాళ్ల సమస్య లేకపోతే.. వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు పరిమిత మోతాదులో బీట్‌రూట్ తీసుకోవచ్చు. అంటే, బీట్‌రూట్ తినాలా.. వద్దా..? అనేది మీకు ఉన్న కిడ్నీ సమస్య రకాన్ని బట్టి నిర్ణయించాలి. వైద్యుల సలహా లేకుండా ఆహారంలో పెద్ద మార్పులు చేయకపోవడం మంచిది. కాల్షియం ఆక్సలేట్ రాళ్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు ఈ కింది ఆహారాలను పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిలో పాలకూర, బీట్‌రూట్, బాదం, వేరుశెనగ, చాక్లెట్, అధిక ఉప్పు,

ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన స్నాక్స్, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, వీటిని కూడా తగ్గించడం మంచిది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా పోషకాహార నిపుణులు సూచించిన ఆహారాన్నే పాటించాలి. సాధారణంగా తగినంత నీరు తాగడం, తాజా పండ్లు, తక్కువ ఆక్సలేట్ ఉన్న కూరగాయలు, తృణ ధాన్యాలు, అవసరమైన మోతాదులో ప్రోటీన్ తీసుకోవడం మంచిది. అలాగే ఉప్పు వినియోగాన్ని తగ్గించి, ప్యాక్ చేసిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవడమే కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గం అని చెప్పవచ్చు.

## ఉప్పు ఎక్కువగా తింటే శరీరంలో కాల్షియం లోపిస్తుందా..?

ఉప్పు మన రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండే పదార్థం. ఏ వంటలోనైనా ఉప్పు లేకపోతే అసలు రుచే ఉండదు. అందుకే 'అన్నేసి చూడు.. నన్నేసి చూడు' అని ఉప్పు గర్విస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఉప్పు నాడీవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే ఈ ఉప్పును అధికంగా తింటే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవడం ఆరోగ్యకరం. అధిక ఉప్పు వాడకం రక్తపోటును పెంచుతుంది. గుండె సమస్యలకు, కిడ్నీ సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా అధికంగా ఉప్పు తీసుకోవడంవల్ల శరీరంలో ఉన్న కాల్షియం మూత్రం ద్వారా ఎక్కువగా బయటకు వెళ్తుంది. దాంతో కాల్షియం లోపం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాల్షియం ఎముకలు, దంతాల బలానికి చాలా అవసరం. కాబట్టి ఉప్పు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కాల్షియం తగ్గి, ఎముకల బలహీనతకు దారితీస్తుంది. ఈ ఎముకల బలహీనత అనేది ముఖ్యంగా ఇప్పటికే




కాల్షియం లోపం ఉన్నవారిలో, వృద్ధుల్లో, మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఈ సమస్య ఉన్నవాళ్లు ఉప్పును పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. మితంగా తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. అదేవిధంగా పాలు, పెరుగు, ఆకుకూరలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. సరైన ఆహార అలవాట్లు పాటిస్తే ఉప్పువల్ల వచ్చే కాల్షియం లోపాన్ని తగ్గించుకోవచ్చు.

## సంపాదకీయం




# సోషల్ మీడియాను కట్టడి చేస్తే.. ప్రజాభిప్రాయాన్ని మార్చగలరా?

ప్రజాస్వామ్యంలో ఒకప్పుడు సమాచారాన్ని నియంత్రించడానికి పత్రికలను అడ్డుకోవాల్సి వచ్చేది. తర్వాత టెలివిజన్ ఛానళ్లపై ప్రభావం చూపడం సరిపోయేది. ఇప్పుడు ఆ అవసరం కూడా తగ్గిపోయింది. ప్రజల చేతిలో ఉన్న ఫోన్‌లోకి వచ్చే సమాచారాన్ని నియంత్రిస్తే చాలు అనే స్థాయికి వ్యవస్థలు చేరుతున్నాయా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. కేంద్ర హోంశాఖ పరిధిలోని సహయోగ్ పోర్టల్ ద్వారా సోషల్ మీడియా వేదికలకు కంటెంట్ తొలగింపు ఆదేశాలు పంపుతున్న వ్యవస్థపై వెలువడుతున్న వివరాలు ఈ ఆందోళనను మరింత పెంచుతున్నాయి. 2024 అక్టోబర్ నుంచి 2025 అక్టోబర్ మధ్య 19 ఆన్‌లైన్ వేదికలకు 2,300కు పైగా బ్లాకింగ్ ఆర్డర్లు పంపినట్టు ఆర్టీఐ ద్వారా వెల్లడైంది. అంటే రోజుకు సగటున ఆరు ఆదేశాలు. అయితే ఒక్కో ఆదేశంలో అనేక లింకులు, ఖాతాలు ఉండే అవకాశం ఉంది. సహయోగ్ పరిధిలోకి వచ్చిన ఆన్‌లైన్ వేదికల సంఖ్య కూడా 118 దాటింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి కోట్లాది మంది ఉపయోగించే వేదికలు కూడా ఈ వ్యవస్థలో భాగమయ్యాయి.

ఇక్కడ మరింత ఆందోళన కలిగించే పరిణామం ఇంకొకటి ఉంది. భారత్‌లో స్థానిక చట్టాల ఆధారంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్‌ను పెద్ద స్థాయిలో ఆటోమేటిక్‌గా పరిమితం చేసే వ్యవస్థను మెటా అమలు చేస్తున్నట్టు సంస్థ వర్గాలను ఉటంకిస్తూ ది హిందూ నివేదించింది. అంటే ఇక ప్రతి పోస్టును ఒక మనిషి కూర్చొని పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వ సూచనలను సాంకేతిక వ్యవస్థలు భారీ స్థాయిలో అమలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వేగం పెరగడం మాత్రమే కాదు. ఇది అధికార స్వభావంలో మార్పు. ఒక పోస్టును తొలగించడానికి ముందు దాని నిజానిజాలను స్వతంత్రంగా పరిశీలించారా? అది నిజంగా చట్టవిరుద్ధమైనదేనా? ప్రభుత్వాన్ని విమర్శించడం, ఒక ప్రజాప్రతినిధిని విమర్శించడం, తప్పు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, ప్రజలను హింసకు ప్రేరేపించడం... వీటన్నింటికీ మధ్య ఉన్న తేడాను ఎవరు నిర్ణయిస్తున్నారు? ఆ నిర్ణయంపై అప్పీల్ చేసే అవకాశం ఉందా? తొలగించిన కంటెంట్‌కు కారణం ప్రజలకు స్పష్టంగా చెబుతున్నారా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు పారదర్శకంగా లేకపోతే సమస్య కేవలం ఒక పోస్టు తొలగింపుతో ముగియదు. ఎందుకంటే సమాచారం కనిపించకుండా చేయడం కూడా ఒక రకమైన అధికారమే. జంతర్‌మంతర్ ఘటన దీనికి తాజా ఉదాహరణ. అక్కడి నిరసనలకు సంబంధించిన కొన్ని పోస్టులు, వీడియోలను తొలగించాలని ఢిల్లీ పోలీసులు సోషల్ మీడియా వేదికలను కోరినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. చట్టవిరుద్ధమైన లేదా అభ్యంతరకరమైన కంటెంట్‌పై చర్య తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఒక నిరసనకు సంబంధించిన కంటెంట్‌లో ఏది చట్టవిరుద్ధం, ఏది రాజకీయ విమర్శ, ఏది ప్రజల అభిప్రాయ వ్యక్తీకరణ అనే గీతను ఎవరు గీస్తున్నారు అన్నదే అసలు విషయం.

ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా నియంత్రించడం మాత్రం అంత సులభం కాదు. ఒక వేదిక నుంచి తొలగించిన సమాచారం మరో వేదికకు వెళ్లవచ్చు. ఫేస్‌బుక్ నుంచి తొలగించిన వీడియో యూట్యూబ్‌లో ఉండొచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించని విషయం వాట్సాప్ గ్రూపుల్లో తిరగొచ్చు. ఒక ఖాతాను నిలిపివేస్తే మరో ఖాతా రావచ్చు. పైగా ఒక సమాచారాన్ని అణచివేయాలనే ప్రయత్నమే దానిపై ఆసక్తిని మరింత పెంచే అవకాశమూ ఉంది. అందువల్ల సోషల్ మీడియాను నియంత్రించడం ద్వారా ప్రజల ఆలోచనలను పూర్తిగా నియంత్రించగలమని ఎవరైనా భావిస్తే అది భ్రమే. కానీ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయలేమని అనుకోవడం కూడా అంతే ప్రమాదకరం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అభిప్రాయం కేవలం ప్రజలు మాట్లాడటం వల్ల ఏర్పడదు. ప్రజలు ఏ సమాచారాన్ని చూస్తున్నారు, ఏ సమాచారాన్ని మిస్ అవుతున్నారు, ఏ విషయంపై చర్చ జరుగుతోంది, ఏ విషయంపై చర్చే జరగడం లేదు అన్నదానితో కూడా అది నిర్మితమవుతుంది.

ఇదే చోట ప్రభుత్వ నియంత్రణకు మరో కోణం ఉంది. సహయోగ్ పోర్టల్ ఉద్దేశం చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ కంటెంట్‌పై వేగంగా చర్య తీసుకోవడమేనని ప్రభుత్వం చెబుతోంది. చట్టవిరుద్ధమైన కంటెంట్, బాలలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్, హింసను ప్రేరేపించే సమాచారాన్ని అడ్డుకోవడంలో వేగవంతమైన వ్యవస్థ అవసరమే. ప్రభుత్వం కూడా ఇంటర్నెట్‌ను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉంచడమే లక్ష్యమని చెబుతోంది. కానీ చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించడం ఒకటి, ప్రభుత్వానికి అసౌకర్యం కలిగించే కంటెంట్‌ను తొలగించడం మరొకటి. ఈ రెండింటి మధ్య గీత చెరిగిపోకుండా చూడటమే ప్రజాస్వామ్య వ్యవస్థల అసలు పరీక్ష. సహయోగ్ వ్యవస్థపై న్యాయపరమైన అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులకు కంటెంట్ తొలగింపు ప్రక్రియలో విస్తృత పాత్ర లభించడం, స్వతంత్ర పరిశీలనకు తగిన స్థలం ఉందా అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవస్థను సవాలు చేస్తూ న్యాయస్థానాల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి.

ప్రభుత్వం ప్రజల కోసం సమాచారాన్ని రక్షించాలి. ప్రజల నుంచి సమాచారాన్ని దాచే అధికారం మాత్రం జాగ్రత్తగా, అత్యంత పరిమితంగా మాత్రమే ఉపయోగించాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి విమర్శ అంటే శత్రుత్వం కాదు. అసమ్మతి అంటే దేశద్రోహం కాదు. నిరసన అంటే అశాంతి కాదు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి పోస్టు తప్పుడు సమాచారం కాదు. "ప్రజలు ఏం చూడాలో నిర్ణయించే అధికారం ఎవరిది?" అనే ప్రశ్న వరకు వెళ్లాలి. ప్రజాస్వామ్యంలో ఆ అధికారం ఒక్క ప్రభుత్వానిదీ కాదు. ఒక్క సోషల్ మీడియా సంస్థదీ కాదు. చివరికి ప్రజలకే సమాచారం కావాలి. నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ కూడా వారిదే కావాలి.

# ఆ కర్కశత్వాన్ని ప్రశంసించాలా?

- మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై రాహుల్ ఫైర్
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్, మేకుల లాఠీలతో దౌర్జన్యం
- గాయపడిన చిన్నారులను పరామర్శించానన్న కాంగ్రెస్ ఎంపీ
- తప్పులు అంగీకరించని వారితోనే దేశానికి ముప్పు అని వ్యాఖ్య



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రశంసించడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అబద్ధాలు చెప్పకూడదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలని మోదీ ప్రభుత్వంలోని మంత్రులు అంటున్నారని, కానీ పార్లమెంటుకు అర కిలోమీటరు దూరంలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌ను ప్రయోగించారని రాహుల్ విమర్శించారు. మేకులు గుచ్చిన లాఠీలను సైతం వినియోగించారని ఆరోపించారు. పోలీసుల దాడిలో ఒక పిల్లాడి కన్ను పోయిందని, మరో యువతి చెవి తెగి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇలాంటి కర్కశత్వాన్ని ప్రశంసించాలా?" అని ఆయన ప్రశ్నించారు. గాయపడ్డ పిల్లల్ని తాను వ్యక్తిగతంగా కలిశానని, నిరసనల నాటి వేల కొద్దీ వీడియోలను దేశం మొత్తం చూసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం అసత్యాలు, హింసపై ఆధారపడుతోందని రాహుల్ ఆరోపించారు. మొదట హింసను ప్రయోగించి, ఆ తర్వాత అలాంటిదేమీ లేదని బుకాయిస్తోందని విమర్శించారు. తమ తప్పులను అంగీకరించలేని వారితోనే దేశానికి భారీ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. "పిల్లలతో అబద్ధాలు చెప్పొద్దు. వాళ్లకు కళ్లు ఉన్నాయి. అన్నీ గుర్తుంటాయి" అని వ్యాఖ్యానించారు.

### మంత్రి ఏమన్నారంటే..

నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల సమర్థించారు. ఎవరికీ ఎలాంటి భారీ నష్టం జరగకుండా అంతటి జన సమూహాన్ని భద్రతా దళాలు జాగ్రత్తగా నియంత్రించాయని అన్నారు. ఇందుకు ఢిల్లీ పోలీసులతో పాటు పరిపాలన యంత్రాంగాన్ని ప్రశంసించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో నిరసనల సందర్భంగా పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని ఆయన విమర్శించిన విషయం తెలిసిందే.

# విద్యార్థులపై దాడి.. విచారణకు సుప్రీం కమిటీ!

- 'చలో పార్లమెంట్' ఘటనపై త్రిసభ్య ధర్మాసనం కీలక నిర్ణయం
- మాజీ న్యాయమూర్తులు, విశ్రాంత డీజీపీతో ఉన్నతస్థాయి ప్యానెల్
- వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించనున్న బృందం
- నేర చరిత్ర లేని విద్యార్థులపై ఎఫ్ఐఆర్ రద్దుకు యోచన



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** 'చలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజే), విశ్రాంత డీజీపీతో ఈ కమిటీ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన అధికారిక ఆదేశాలు బుధవారం వెలువడతాయని ధర్మాసనం ప్రకటించింది.

### ఫుటేజీల పరిశీలన.. బాధితుల విచారణ..

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీలు, సీసీటీవీ రికార్డింగ్స్‌ను కమిటీకి అందజేయాలని ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో మహిళా నిరసనకారులే లక్ష్యంగా దాడులు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలు, నమోదైన ఫిర్యాదులను కూడా ఈ ఉన్నతస్థాయి కమిటీ పరిశీలిస్తుందని ధర్మాసనం తెలిపింది. బాధితులందరి వాదనలను విన్న అనంతరం, కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

### విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం..

మరోవైపు విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తాను ధర్మాసనం ఆదేశించింది. ఎలాంటి నేర చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన కేసులను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. ఆర్టికల్ 19 కింద నిరసనలు తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని గుర్తుచేసింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఐఆర్‌ల రద్దుపై తుది నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



# ఉరిశిక్షను రద్దు చేయండి

### ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి

### సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ,ఆగస్ట్18:** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



**న్యూఢిల్లీ,ఆగస్ట్18:** ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

# 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

**న్యూఢిల్లీ,ఆగస్ట్18:** ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్దు వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా-పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

# బీసీ బాలికల హాస్టల్ భవనాన్ని పూర్తి చేయాలి




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని జనకపూర్ వద్ద రూ. 3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన బీసీ బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం భవనాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 70 శాతం పూర్తయిన ఈ నిర్మాణం పెండింగ్ బకాయిల వల్ల నిలిచిపోయి, ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థినులు అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్నారని, ఈ భవనం అందుబాటులోకి వస్తే 200 మందికి వసతి లభిస్తుందన్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు సమీర్, శివశంకర్, వసంత్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలి

## రాష్ట్ర మంత్రి జూపల్లికు మాలి సంఘం వినతి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలని కోరుతూ మాలి సంఘం నాయకులు, పూలే సేవా సమితి సభ్యులు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. కాగజ్నగర్ పట్టణంలో మంత్రి పర్యటన సందర్భంగా మంగళవారం కలిశారు. మాలి కులస్తుల సామాజిక, ఆర్థిక, విద్యా వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్టీ హోదా కల్పించే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. మాలి సమాజానికి న్యాయం జరిగేలా తమ డిమాండ్ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు మాట్లాడుతూ మాలి సమాజానికి ఎస్టీ హోదా కల్పించే వరకు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మాలి సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్పై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు, పూలే సేవా సమితి సభ్యులు, మాలి కులస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు మంగళవారం మండల కేంద్రంలోని ఐబిలో గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం, ఆయన ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావిత రాలకు అందిస్తూ గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం గౌడ్, శంకర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మనోహర్ గౌడ్, రవి గౌడ్, మొండి గౌడ్, కిష్ట గౌడ్, సుధీర్ గౌడ్, భాస్కర్ గౌడ్, మహీధర్ గౌడ్, పున్నం గౌడ్, గౌడ యువ నాయకులు ప్రసాద్ గౌడ్, సాయివర్ధన్ గౌడ్, నవీన్ గౌడ్, సాయి సృజన్ గౌడ్, రుత్విక్ గౌడ్, అభిజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గౌడ సంఘం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# విజ్ఞానానికి కాకుండా కులానికి ప్రాధాన్యత ఇస్తున్న డీఎస్ఓ

## ఎమ్మార్పీఎస్ నాయకులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న జిల్లా సైన్స్ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, విజ్ఞానానికి కాకుండా స్వకులస్తులకు, బంధువులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు పొన్నాల నారాయణ, రొడ్డ శంకర్, నాగరాజు, ఇగూరపు రాజయ్య, బోమ్మెన్న వెంకటి ఆరోపించారు. మంగళవారం ఆసిఫాబాద్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా సైన్స్ అధికారిగా ఉన్న వ్యక్తి ఏ ఉపాధ్యాయ సంఘంలోనూ బాధ్యతలు వహించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, సదరు అధికారి ఒక ప్రధాన ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ నుండి రాష్ట్ర శాఖ వరకు బాధ్యుడిగా వ్యవహరిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనకు అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులను విస్మరించి, తన బంధువులైన జూనియర్ ఉపాధ్యాయులను రెండుసార్లు పంపించారని విమర్శించారు. అంతేకాకుండా, కాగజ్నగర్లోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న తన బంధువుకు ప్రతి సంవత్సరం అకాడమీ కోఆర్డినేటర్గా, దహేగాం మండలంలో పనిచేస్తున్న మరొక ఉపాధ్యాయురాలికి వరుసగా విద్యా అవకాశాలు కట్టబెడుతున్నారని ఆరోపించారు. తన బంధువుకు 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2026' ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ, అర్హత కలిగిన కష్టపడే ఇతర ఉపాధ్యాయునిపై దురద్దేశ పూర్వకంగా ఆకాశరామన్న ఉత్తరాల రూపంలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు పంపించినట్లు ఆరోపించారు. అలాగే, సిర్పూర్ (టి) మండలం భూపాలపట్నం విద్యార్థిని అల్స మమత, గైడ్ టీచర్ కేశవ్ 'ఇన్స్పైర్ మనక్'లో జాతీయ స్థాయికి ఎంపికై పేటెంట్ హక్కులు సాధిస్తే, ఆ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. గత సంవత్సరం జిల్లా స్థాయి విద్యార్థుల సెమినార్లో ఒక బంధువును ఆర్గనైజర్గా, మరో బంధువును జడ్జిగా నియమించి, తనకు అనుకూలమైన విద్యార్థిని రాష్ట్ర స్థాయికి పంపించారని విమర్శించారు. సొంత నిధులు, శ్రమతో కష్టపడే ఉపాధ్యాయులకు మొండిచెయ్యి చూపుతూ, నిబంధనలను అతిక్రమిస్తున్న సదరు అధికారి తీరుపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మా కంపెనీ, సి.ఎస్..ఆర్. నిధులతో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి 25 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణంతో ఇందాని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ప్రతినిధి లోకేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిర్మల, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డివైఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

## జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1980 నవంబర్లో ఆవిర్భవించిన డివైఎఫ్ఐ, జిల్లాతో పాటు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధన కోసం నిరంతరాయంగా పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడంతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడానికి ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22, 23 తేదీలలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్లో ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని యువతీయువకులు, నిరుద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, నాయకులు, కార్యకర్తలు చక్రి, ఎం. జశ్వంత్, సాయికిరణ్, నూతన్ కుమార్, ఎన్. జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

## నిందితుడి అరెస్ట్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** ఆసిఫాబాద్ మండలం కొత్త రాహపల్లి గ్రామానికి చెందిన ముంజం లలిత ఈ నెల 16న వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో, దుండగులు ఆమె ఇంటి అల్మారా తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### 24 గంటల్లోనే దొంగను పట్టుకున్న పోలీసులు

బాధితురాలి ఫిర్యాదుపై వేగంతో స్పందించిన ఆసిఫాబాద్ పోలీసులు, సాంకేతిక ఆధారాల సహాయంతో కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించారు. బాధితురాలి సొంత గ్రామానికి చెందిన వడై లాలాజీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి సుమారు రూ.1,50,000 విలువైన 38.320 గ్రాముల బంగారు ఆభరణాలైన నెక్లెస్, చెవి కమ్మలు, ఉంగరాలు, చిన్న చెవి కమ్మలు, ముక్కుపోగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఆసిఫాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నీలం రవి తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం నిరవధిక సమ్మెకు కూర్చొని తమ డిమాండ్ నెరవేర్చలని నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు



12,769 గ్రామ పంచాయతీల్లో 53,000 మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, 2వ పీఆర్సీలో గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయిస్తూ జీఓ నం.51 సవరణ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న, మృతిచెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, ఆన్లైన్లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేస్తు, మరణించిన కార్మికులకు దహన సంస్కారాల కోసం రూ.30వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

# స్క్రాప్ వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తమ సమస్యలను పరిష్కరించాలని స్క్రాప్ వ్యాపారులు కోరారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వ్యాపారులు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువతో సత్కరించారు. అనంతరం వ్యాపారులు మాట్లాడుతూ పట్టణంలో పాత సామాన్లు, స్క్రాప్ కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సాజిద్ ఖాన్ మాట్లాడుతూ పాత సామాన్ల వ్యాపారంపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అన్నారు. చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. వ్యాపారులు తమ వృత్తిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ హషాం అలీ, ఇసాఖ్, నిజాం రఫీక్, రయీస్ తదితరులు పాల్గొన్నారు.



# వాట్సాప్ చాట్ బాట్ కు ఏఐ అనుసంధానం

- విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువగా టీజీ ఎన్పీడీసీఎల్ ఏఐ
- వాట్సాప్ చాట్ బాట్ ద్వారా 24/7 సేవలు
- ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన
- ఎస్ ఈ ఉత్తమ్ జాడే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ( టీజీ ఎన్పీడీసీఎల్ ) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. వినియోగదారులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సమస్యలను ఇంటి నుంచే తెలియజేసి అవసరమైన సేవలను పొందేలా సంస్థ అనేక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. ఇందులో భాగంగా 24 గంటలు, 7 రోజులు అందుబాటులో ఉండే వాట్సాప్ చాట్ బాట్ సేవలను వినియోగించుకోవాలని వినియోగదారులను కోరారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సేవల వివరాలు, బిల్లింగ్, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్ తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు.

**వాట్సాప్ చాట్‌బాట్ నంబర్ 87124 81489**

వినియోగదారులు పై నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో hi అని మెసేజ్ పంపడం ద్వారా అందుబాటులో ఉన్న వివిధ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్, సోలార్ , కు సంబంధించిన సమాచారం తదితర సేవలను సులభంగా పొందవచ్చన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 1912, ఏఐ వాట్సాప్ చాట్‌బాట్, మొబైల్ యాప్, వెబ్ సైట్ తదితర ఆధునిక సేవా మార్గాలను మరింత బలోపేతం చేసిందని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను నమోదు చేసి, వాటిని సంబంధిత అధికారులకు చేర వేయడంతో పాటు, పరిష్కార ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించే విధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రతి విద్యుత్ వినియోగదారుడికి వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తున్నాం" అని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సులభంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వినియోగదారుల సంతృప్తే టీజీ ఎన్పీడీసీఎల్ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

**జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, మొఘల్ సామ్రాజ్య దౌర్జన్యాలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ కొనియాడారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ పాపన్న విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న, పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గెరిల్లా సైన్యాన్ని నిర్మించి సుమారు 21 కోటలను స్వాధీనం చేసుకోవడం సాహసానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారత దేశంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి స్వాతంత్ర్య సమరయోధులకు, బ్రిటిష్ పాలకులపై పోరాడేందుకు పాపన్న చరిత్ర గొప్ప స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఇంచార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, మున్సిపల్



కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, చరణ్ గౌడ్, బిసి, గౌడ సంఘం నాయకులు దత్తు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధంగానే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అమలు

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఆరోపణలు అవాస్తవం: ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, బోథ్:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగానే అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కార్యనిర్వాహక అధికారాల పరిధిలోనే ఈ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాలపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర పరిధిలోని సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అమలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన రాయ్ సాహిబ్ రామ్ జవాయ కపూర్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం తీర్పు స్పష్టమైన న్యాయ ఆధారమని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలేనని, వీటి అమలును శాసనసభ విధులకు విరుద్ధంగా పేర్కొనడం అవగాహన రాహిత్యమన్నారు. ప్రజాధనాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. పథకాలకు కేటాయించే నిధులకు రాష్ట్ర బడ్జెట్ ద్వారా శాసనసభ ఆమోదం ఉంటుందని తెలిపారు. ట్రెజరీ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్ తదితర ఆర్థిక నిబంధనలకు అనుగుణంగానే నిధులు విడుదలవుతాయని చెప్పారు. పేద ప్రజల సంక్షేమానికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మబోరని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన విజయవంతంగా కొనసాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.

# నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సర్చ్

- సొనాల మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్
- స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకట నర్సయ్య





**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.వెంకట నర్సయ్య అన్నారు. మంగళవారం సొనాల మండల కేంద్రంలో 150 మంది పోలీసు సిబ్బందితో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 232 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లతో పాటు ఫేక్ నంబర్ ప్లేట్ కలిగిన కారును స్వాధీనం చేసుకుని, ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్లు ధరించాలని, కాలనీల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు సిహెచ్ రమేష్, బి.ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వెంకటి, టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, ఎస్సైలు పురుషోత్తం, రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుంటాలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** కుంటాల జలపాతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఎకో టూరిజం ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతులు కలిపిస్తామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కుంటాల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కుంటాల జలపాతం పరిసర ప్రాంతాలను పరిశీలించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. కుంటాల జలపాతం ప్రకృతి సోయగాలకు నిలయంగా ఉందని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని అన్నారు. ముఖ్యంగా ఎకో టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను దశల వారీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. కుంటాల జలపాతం వద్ద పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కుంటాల జలపాతం కేవలం రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎకో టూరిజం కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. కుంటాల జలపాతం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు కుంటాల జలపాతం పరిసర ప్రాంతాలను పరిశీలించి, పర్యాటకుల సౌకర్యాలు, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై వివరాలు సేకరించారు.



# కౌన్సిలర్ దంపతులకు మంత్రి జూపల్లి పరామర్శ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఇటీవల కాగజ్నగర్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ కౌన్సిలర్ ఎమ్మాజీ శారద సంతోష్ దంపతులను రాష్ట్ర మంత్రి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైదుయలకు సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ కూడా కౌన్సిలర్ దంపతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**నివాళులు అర్పించిన ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ బహుజన పోరాట యోధుడు, అణచివేతపై ధైర్యంగా తిరగబడిన మహా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను స్థానిక బస్ స్టాండ్ ఎదురుగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అధికారిక జయంతి వేడుకల్లో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల ఆత్మగౌరవం, సమానత్వం కోసం పాపన్న చేసిన పోరాటాలను, ఆయన చారిత్రక ప్రాధాన్యతను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, కౌన్సిలర్లు కలల శ్రీనివాస్, చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కు తిరుపతి ప్రసాదం



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా.హత్నూర మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాచునూరి సురేష్ మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదాన్ని స్వీకరించి వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభీక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, మధు, మాయిని శ్రీకాంత్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు నాణ్యమైన భోజన, వసతి కల్పించాలి

**ఐటీడీఏ పీఓ మంద మకరందు**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు సూచించారు. మంగళవారం మండలంలోని కుంటాల గ్రామ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పిల్లల హాజరు శాతం, భోజన, వసతి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థులకు కలిపిస్తున్న వసతి, భోజనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంటన హెచ్ఎం ప్రతాప్ సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# రైతులకు అవగాహన కల్పించాలి

## మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** రైతులకు కావాల్సిన రసాయనిక ఎరువులను సులభంగా పొందేలా కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫార్మర్ ఫ్రెండ్లీ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ పట్ల డీలర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా రైతులు తమ పంటల అవసరాలకు అనుగుణంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులను ఎలా బుక్ చేసుకోవాలో డీలర్లు వివరించాలని కోరారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చే ప్రతి రైతుకు యాప్ పనితీరుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. పురుగుల, శిలీంధ్రాల నివారణకు కంపెనీల సిఫార్సుల ప్రకారమే సరైన మోతాదులో మందులు వాడేలా రైతులకు సలహాలు ఇవ్వాలని, డీలర్లు తమ షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులను ప్రతిరోజూ తప్పనిసరిగా అప్డేట్ చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లులను ఖచ్చితంగా అందజేయాలని తెలిపారు. గడువు తీరిన మందులు అమ్మినా, ఎంఆర్పీ ధరల కంటే ఎక్కువ రేట్లకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలంలోని విత్తన, ఎరువులు, పురుగుల మందుల డీలర్లు పాల్గొన్నారు.

# ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

## నేడు తుడుందెబ్బ ఆధ్వర్యంలో బంద్కు పిలుపు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు 75 శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐబీ తాండూర్ బంద్కు పిలుపు నివ్వడం జరిగిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, తాండూర్ మండల అధ్యక్షులు యాపల సమ్మయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి అరికెల శంకర్ లు అన్నారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం చేయాలని, స్థానిక హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ బంద్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 75 శాతం ఉద్యోగాలు ఆదివాసీ యువత హక్కు, ఆదివాసీ హక్కుల పరిరక్షణే మా లక్ష్యమని అన్నారు. బంద్ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు గావుడే మల్లేష్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు, మండల నాయకులు ఊరడి వెంకటేష్, బోగారపు ప్రశాంత్, ఎడ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ బంద్కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

## ఆదివాసి హక్కుల కోసం నేడు బంద్ కు పిలుపు



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఏజెన్సీ బంద్ నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ నాయకులు తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్లో ఆదివాసి అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బంద్కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో అమలు చేసిన విధంగానే ఆదివాసి అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. ఆదివాసి అభ్యర్థుల హక్కులను పరిరక్షించేందుకు చేపడుతున్న ఉద్యమానికి ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో జైనూర్ మండలంలోని వ్యాపారస్తులు, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజలు ఏజెన్సీ బంద్కు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బంద్కు సహకరించాలని కోరుతూ మంగళవారం జైనూర్ తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసి అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం అర్జున్, తుడుందెబ్బ నాయకులు చాహకటి గణేష్, కోట్నాక ప్రకాష్, మెస్రం గోపాల్, ఆనక వెంకటేష్, తుమ్రం దిలీప్ కుమార్, మర్సుకోలా సంజీవ్ కుమార్, ఆత్రం శంకర్, ఆడ దుందేరావ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ శాసన సభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్లు ఆకాష్, సహీన్ సుల్తానా, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్యలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్ నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించడం జరిగిందని, అర్హులైన నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇద్దామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ కొరకు అధిక ప్రాథమిక ఇస్తుందని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పర్యాటకరంగ అభివృద్ధికి నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వట్టివాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతను పాటించడం జరుగుతుందని, ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరు అయితే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, గృహ నిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను పునరుద్ధరించాలి

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను వెంటనే పునరుద్ధరించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. పేద కుటుంబాలకు అండగా నిలిచే షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను వెంటనే పునరుద్ధరించి, పెండింగ్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండా చేసి, ప్రజల దృష్టిలో కేసీఆర్ కనిపించకుండా చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అయితే తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కేసీఆర్ను ప్రజల నుంచి దూరం చేయడం ఎవరి వల్లా కాదన్నారు. పేద కుటుంబాల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని అన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

## ఐటీడీఏ పీఓ మంద మకరందు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నీటి సంరక్షణకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు. మండలంలోని వాగ్దారి గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించారు. వీబీజి రామ్జీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఫార్మ్ పాండ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి మార్కౌట్ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వ్యవసాయ పరిస్థితులు, సాగునీటి వనరులు, సాగు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు పంటలకు నీటి లభ్యతను మెరుగుపర్చడంలో ఫార్మ్ పాండ్లు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం రైతులకు ఎల్నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. ఎల్నినో కారణంగా వర్షపాతం తీరులో మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షాలు ఆలస్యంగా, అసమానంగా కురిసే అవకాశం ఉంటుందని వివరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఫార్మ్ పాండ్లు, చెక్డ్యాములు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గ్రామస్థాయిలో చేపట్టే అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్ రెడ్డి, ఎంపీఓ జీవన్ రెడ్డి, ఏపీఓ వసంత్ రావు, ఏటీడీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమంపై నిర్లక్ష్యం వద్దు

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి
- సత్తుపల్లిలో బీఆర్ఎస్ పోరుబాట

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆర్అండ్బీ గెస్ట్హౌస్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. తొలుత రూ.50వేలతో ప్రారంభమైన ఆర్థిక సహాయాన్ని అనంతరం రూ.1,00,116కు పెంచి వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ పథకాల కింద ఆర్థిక సహాయం కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాల అమలులో ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే ప్రభుత్వం వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఆ హామీపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు భరోసాగా నిలిచిన రైతు బీమా పథకంపై కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. రైతు బీమా ప్రీమియాన్ని సకాలంలో చెల్లించి రైతు కుటుంబాలకు భద్రత కల్పించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజల్లో ఆదరణ లభించిందని, వాటిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే యథావిధిగా కొనసాగించి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



# సత్తుపల్లి ట్రంక్ భూసేకరణకు రూ.45కోట్లు విడుదల

- మూడో నుంచి నాలుగో పంప్హౌస్ మధ్య 532 ఎకరాల భూ సేకరణకు నిధులు
- ఈ సీజన్‌లోనే ఆయకట్టుకు గోదావరి జలాలు
- పనులు వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల ఆదేశం
- సీఎం, డిప్యూటి సీఎం, మంత్రి ఉత్తమ్ కు కృతజ్ఞతలు




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్ పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. మంత్రి తుమ్మల ప్రత్యేక కృషితో మూడు మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ మధ్య అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు విడుదల చేసింది. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిలో మొత్తం 532 ఎకరాల భూ సేకరణకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో భేటీ అయి, దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి మండలాల పరిధిలో 532 ఎకరాల భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి మండలాల్లోని భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు సైతం శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లోనే ఆయకట్టుకు నీరు అందించేలా పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**1.50 లక్షల ఎకరాలకు సాగునీరు..**

సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి తదితర మండలాలకు గోదావరి జలాలు చేరనున్నాయి. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో ఇప్పటివరకు వర్షాధార పంటలను సాగు చేస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయాల్లో సీతారామ ప్రాజెక్టు జలాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు.

**సీఎం, డిప్యూటి సీఎం, మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు..**

సత్తుపల్లి ట్రంక్ భూసేకరణకు రూ.45 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భూసేకరణ, పైప్‌లైన్, పంప్‌హౌస్ తదితర పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఆయకట్టుకు చేరితే ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

# బడికి ఉపాధ్యాయులు లేక.. ప్రతిరోజూ సెలవే..!

- పది రోజులుగా నిలిచిన బోధన
- విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పానాపటార్ గ్రామపంచాయతీ పరిధిలోని మర్కగూడా(కె) గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో పాఠశాలలో ప్రతిరోజూ సెలవు వాతావరణం నెలకొంది. ఈ పాఠశాలలో సుమారు 15 మంది కొలాం గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గత పది రోజులుగా ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు బడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తమ పిల్లల విద్యా భవిష్యత్తుపై తల్లిదండ్రులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థులకు విద్య దూరం..**

గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ, ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పది రోజులుగా బోధన జరగకపోవడంతో విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్థులు కోరారు. మర్కగూడా(కె) ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయుడిని నియమించి, విద్యార్థుల చదువులు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మరు



**ఉద్యమ కెరటం, జైనూర్:** బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ జైనూర్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ అన్నారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తోందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ పథకాలను నిలిపివేయలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న బిల్లులను సైతం చెల్లిస్తూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు పెందుర్ అనసూయ అర్జున్, అయ్యోబాయి భుజంగరావు, ఉయిక చందు, తోడసం రాజేందర్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, నాయకులు దౌలత్రావు, దండుగుల మహేష్, కోటేష్, షేక్ రహీం, కోవా సిద్ధు, మాజీ ఉప సర్పంచ్ షేక్ అబ్బు, ఆనంద్, ముత్త తదితరులు పాల్గొన్నారు.

# వేంసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో నిర్వహించిన సర్వేలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఆసుపత్రిలో మూడు శానిటేషన్ పోస్టులు ఉండాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారని, మరో ఉద్యోగిని డిప్యూటేషన్పై పంపించారని పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టులు ఏడు ఉండగా, నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అడసర్లపాడు, చౌడవరం, కేజీ మల్లెల ప్రాంతాల్లో వైద్యుల కొరత ఉందన్నారు. మొదటి శ్రేణి ఏఎన్ఎం పోస్టులు తొమ్మిది ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత కారణంగా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఆసుపత్రిలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు, నాయకులు మల్లూరు చంద్రశేఖర్, దంకర శ్రీను, కావూరి భగత్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఎల్నినో ప్రభావం, ప్రస్తుత లోటు వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం భీమారం మండలంలో పర్యటించిన కలెక్టర్ గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం కారణంగా సాగునీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. గొల్లవాగు ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పంటల సాగుపై సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల వివరాలను అందించాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. అలాగే భీమారం మండల తహశీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా కేజీబీవీని సందర్శించారు. అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సదానందం, ఆర్ఐ రజిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్మానం




**ఉద్యమ కెరటం, జైనూర్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును జైనూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జైనూర్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జైనూర్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, రహదారులు, విద్య, వైద్యం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, సహకారం అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. మండల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వెంటనే వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బి సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి సంబంధిత మండలాల తహశీల్దార్లు, రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లపై సమీక్షించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం బకాయిల వసూళ్లకు అనుసరించాల్సిన విధివిధానాలు, మిల్లుల వారీగా పెండింగ్లో ఉన్న బకాయిల వివరాలు, రికన్సిలియేషన్, కోర్టు కేసుల అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో గుర్తించి, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ నిబంధనలకు అనుగుణంగా బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించిన అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులుపాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బహుజన చక్రవర్తి, వీరశిఖామణి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అణచివేతపై తిరగబడి, సమాజంలో సమానత్వం కోసం, బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఏ చట్టాలకూ లోబడి కాకుండా, కేవలం నిజమైన లబ్ధిదారులకు మేలు చేయాలనే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన సంక్షేమ పథకాలు, కాలక్రమేణా ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ, ఈబీసీ వర్గాలకు కూడా విస్తరించి నేడు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఈ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం.. పథకాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఏకంగా రూ.16,375.87 ఖర్చు చేసి, మొత్తం 16,78,347 మంది లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. సామాన్య, పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా రంజక పాలన నిరంతరం కొనసాగాలని, రాబోయే రోజుల్లోనూ "ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్" నినాదంతో ప్రజా సంక్షేమ పాలనను మరింత ముందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# భారత్ విజయం లాంఛనమే!!

- భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్
- 372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన
- గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్
- శ్రీలంక విజయానికి 288 పరుగులు
- గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రభాత్ జయసూర్య(3/43) మూడు



వికెట్లు పడగొట్టాడు. కేశర సువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# హాకీ ప్రపంచ కప్.. భారత మహిళల ఘన విజయం!

- దక్షిణాఫ్రికాపై 6-1తో భారత జట్టు జైత్రయాత్ర
- టోర్నీలోనే టీమిండియాకు అతిపెద్ద గెలుపు
- సమష్టిగా రాణించిన ఫార్వర్డ్, డిఫెన్స్ విభాగాలు
- పూల్-డిలో మరింత పటిష్టమైన భారత్ స్థానం



మహిళల హాకీ ప్రపంచ కప్ 2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. పూల్-డి రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత క్రీడాకారిణులు వరుస గోల్స్‌తో విరుచుకుపడ్డారు.

### ఆరంభం నుంచే జోరు..

మ్యాచ్ 11వ నిమిషంలో సునేలిటా టోప్పో గోల్ చేసి భారత్‌కు అదిరిపోయే శుభారంభం అందించింది. సర్కిల్‌లోకి వచ్చిన బంతిని అందుకున్న టోప్పో ఎలాంటి పొరపాటు చేయకుండా నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపింది. దక్షిణాఫ్రికా రక్షణ విభాగం చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారత్ తొలి ఆధిక్యాన్ని సాధించింది.

### గోల్స్ వర్షం కురిపించిన భారత్..

రెండో క్వార్టర్‌లోనూ భారత మహిళలు తమ దూకుడు కొనసాగించారు. నవనీత్ కౌర్, సుశీలా చాను చెరో గోల్ సాధించడంతో భారత్ పటిష్ట స్థితికి చేరింది. మూడో క్వార్టర్‌లో భారత జోరు మరింత పెరిగింది. దీపిక, లాల్‌రెమ్సియామి, రాణా సాక్షి వరుసగా ఒక్కో గోల్ నమోదు చేయడంతో భారత్ ఆధిక్యం 6-0కు చేరింది. మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లోకి వెళ్లడంతో దక్షిణాఫ్రికా జట్టు తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయింది.

### పూల్-డిలో తిరుగులేని స్థానం..

చివరి క్వార్టర్‌లో దక్షిణాఫ్రికా ఒక గోల్ సాధించి భారత ఆధిక్యాన్ని స్వల్పంగా తగ్గించింది. అయితే అప్పటికే మ్యాచ్ పూర్తిగా భారత్ వైపు ఉండటంతో ఆ గోల్ ఎలాంటి ప్రభావం చూపలేదు. చివరకు భారత్ 6-1తో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో పూల్-డి పోటీలో భారత జట్టు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో భారత ఫార్వర్డ్ లైన్, డిఫెన్స్ విభాగాలు రెండూ సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించాయి.

# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయ-ంమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.




# గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు..

### మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు


కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. జాబితాలో నిలిచారు.



# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో

అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్





# ఏపీలో టాలీవుడ్‌కి రెడ్‌కార్పెట్!

**సినీ పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**సింగిల్ విండో ద్వారా వేగంగా ఉచిత షూటింగ్ అనుమతులు**

**విజయవాడలో వైభవంగా 'వెండితెర - ఓటీటీ అవార్డ్స్'**

**ముఖ్య అతిథిగా హాజరైన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

**విజయవాడ (సమయం న్యూస్):** రాష్ట్రంలో కళలను, కళాకారులను ప్రోత్సహించడంతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో 'విబి ఎంటర్‌టైన్‌మెంట్స్' ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్టిస్ట్ ఉ సేవ్ టాలెంట్' పేరుతో నిర్వహించిన "వెండితెర - ఓటీటీ అవార్డ్స్ 2025-26" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు. విజయవాడ మొదటి నుంచీ సాంస్కృతిక, సినీ వ్యాపార రంగానికి అనుకూల ప్రాంతమని, ఇక్కడి నుంచి ఎందరో గొప్ప నటులు, సాంకేతిక నిపుణులు చిత్రసీమకు వెళ్లి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని మంత్రి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్‌లు జరుపుకునే చిత్రాలకు ఉచితంగా, సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, ఇక్కడ డబ్బింగ్, రికార్డింగ్, రీ రికార్డింగ్ థియేటర్ల ఏర్పాటుకు నిర్మాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే టాలీవుడ్ నిర్మాతలతో ఈ విషయమై చర్చలు జరిపామన్నారు.

### కళాకారులకు ప్రభుత్వ దన్ను..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వయాన కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో సినీ పరిశ్రమను విస్తరింపజేస్తామని మంత్రి చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చే వారికి భూ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ తరహాలోనే విజయవాడలోనూ తరచూ సినీ ఈవెంట్లు, అవార్డు వేడుకలు నిర్వహించాలని, ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. మంత్రి కందుల దుర్గేష్ చొరవ వల్ల ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని వేడుకకు హాజరైన సినీ ప్రముఖులు ప్రశంసించారు. మన సంస్కృతిని పరిరక్షిస్తూ, యువ కళాకారుల కలలకు ప్రాణం పోయడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని విబి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకులు తెలిపారు.

### 'ఉత్తరం' పాట విడుదల..

రామకృష్ణ నిర్మాతగా, శరత్ దర్శకత్వంలో విక్రమ్, శ్రీ గాయత్రి నటీనటులుగా పల్లెటూరి ప్రేమ కథగా తెరకెక్కిన "ఉత్తరం" చిత్రానికి సంబంధించిన పాటను ఈ వేదికపై విడుదల చేశారు. సంగీత దర్శకుడు మహిమదన్ అందించిన సంగీతం బాగుందని మంత్రి కొనియాడుతూ, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులు కే.ఎస్. రామారావు, ప్రముఖ హీరో వడ్డే నవీన్, సంగీత దర్శకులు రఘు కుంచె, సినీ నటులు దివ్యవాణి, అనిత, రాజీవ్ కనకాల, సమీర భరద్వాజ్, ఆట సందీప్, జ్యోతి, బేబీ శ్రీదేవి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణా, కార్యక్రమ నిర్వాహకులు విష్ణు బొప్పన, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





# సంక్రాతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.







# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**